


## వివరాలు

పేరు : సరికొండ రవీంద్రనాథ్. జన్మ స్థలం వరంగల్ జిల్లాలో రాజోలు గ్రామం. ఖమ్మం యస్. ఆర్. అండ్ బి. జి. యన్. ఆర్. కళాశాలలో బి. యస్‌సి. మొదటి సంవత్సరం. నా మొదటి కథ 1978లో ఆంధ్రభూమిలో ప్రచురించబడింది. "చీకటి విలిచింది."

రచయిత నయ్యేందుకు ప్రేరేపణ మా అమ్మ, నాన్న- రాధా, కిషన్ రావులు, మార్క్సిజం.

మీ ప్రోత్సాహాన్ని ఆశిస్తూ.

—సరికొండ రవీంద్రనాథ్

సేసేపని, నెహ్రూ సేసేపని ఒక్కటే అన్నాడండి. జీతాలు పోల్చేడండి. పనిలోంచి పనిలేదని తీసేసి ఇంకోళ్ళను పెట్టుకోడంవల్ల మిల్లు యజమానులకు మిగులు రూపాయల్ని తేల్చి చెప్పాడండి. ఒక యింట్లోనే ఇది జరగడం అపూర్వం అన్నాడండి. సెరిత్రలో ఎప్పుడూ జరగనేదటండి. దవ్వోలబ్బణం అన్నాడండి. అన్నీ అర్థం కాలేదండి. కాని సరిగ్గా అప్పుడే గుర్తుకొచ్చిందండి. సిన్నప్పుడెప్పుడో మా అమ్మను అడిగానటండి. అద్దంలో నా ముఖం యెనక్కూడా కనిపించాలని. నా కొడుకు రావులోరంత టోడని మా అమ్మ సంతోషపడిందిగాని. సెడ పుట్టిందని అందరూ తిట్టేరండి. ఇప్పుడు కనిపించిందండి. అన్ని వైపుల్నించి కనిపించిందండి. అద్దంలో కనిపించేదంతా అబద్ధవండి : మోసవండి ! కుడి ఎడమలుగా కనిపిస్తదండి. వెనక భాగం అసలు కనిపించదండి. ఎంత తెలివి పెరిగినా మనిషి మంచిగా అద్దం తయారు సేయనేక పోయేడండి. మోసపోతున్నామండి ! జాగర్తండి !! లీడరు లేసిపోయాడండి - అనుభవజ్ఞుడండి.

ముసలాడు లేసే పెయత్నంలో లేడండి. నేను పెయత్నం సేత్తన్నానండి. ఇదండి కత !

---

"దిక్కులేని ముసిలివాళ్ళందరికీ ప్రభుత్వం పెన్షన్‌లిస్తుంది" అన్న వార్త విన్నాడు ఆంజనేయులు. ఆంజనేయులంటే సాక్షాత్తూ మన పురాణాల్లో ఆంజనేయుడే.

ఆయన బంధువులూ, మిత్రులూ అంతా హెడ్ క్వార్టర్స్‌కి పోయి రంభ, ఊర్వశుల కేబరేలూ, గంధర్వుల ఆర్కెస్ట్రాలు చూస్తూ ఉంటే చిరంజీవి అయిన పాపానికి ఇంకా ఈ భూమ్మీదే మగ్గుతూ అన్యాయాల కేబరేలూ, ఖతాజుల ఆర్కెస్ట్రాలు చూడలేక గుహల్లోకెళ్ళి కళ్ళు మూసుకున్నారు.

నేనూ ప్రయత్నించి చూస్తాను అనుకున్నాడు ఆంజనేయుడు. మనస్సులో ఓమాటు అన్పించింది నా రామచంద్రుడే నాకు దిక్కు కదా అని. కానీ దాన్నోసారు నొక్కి పారేశాడు. అయినా ఇప్పుడాయనెక్కడున్నాడు? పార్టీ మార్చేశాడుగా.



# పాపం! చిరంజీవి

పంతుల నాగేశ్వరరావు

అయినా నేనాయనకి సేవకుడనే గాని బంధువును కాను కదా. కాబట్టి నేను దిక్కులేని వాణ్ణే అనుకున్నాడు.

బయల్దేరి తాలూకాఆఫీసుచేరుకున్నాడు. తోవలో తన కోవెల కన్పిస్తే దండం పెట్టుకుని మరీ వెళ్ళేడు. వెళ్ళేముందు అనుకున్నాడు ఈ మేకప్‌తో మనుష్యుల్లోకి వెళితే బాగుండదని. కానీ మనుషుల్లోనే కుక్కలూ, నక్కలూ, తోడేళ్ళూ వుంటే కోతిని నన్నెవరు పట్టించుకుంటారు అని సమాధానపడ్డాడు. అంతేకాక రోజూ కోవెలకొచ్చి కొబ్బరికాయ కొట్టి మరీ నన్ను ప్రార్థిస్తారు కదా నేను కనపడగానే చాలా సంతోషిస్తారు అనుకున్నాడు.


ఆఫీసు చేరుకోగానే ప్యూను హనుమాన్లు ఆంజనేయుల్ని కొట్టినంత పని చేసేడు. వేషం వేస్తే డబ్బులు దండుకుందికి బజారంతా వుంది- ఈ ఆఫీసు పనికిరాదన్నాడు.తన భక్తుణ్ణి కాళ్ళుపట్టుకు బతిమాలి మెల్లిగా ఆఫీసులోకి ప్రవేశించాడు. లోపలంతా గందరగోళంగా వుంది. కుర్చీకి, కుర్చీకి మధ్య బీరువాలు పేర్చి వున్నాయి. మొదటి కుర్చీలో ఎవడో బెల్‌బాటం కుర్రాడు కూర్చుని ముందురోజు తాను చూసొచ్చిన "కోతిగాడు" సినిమాలో భీమారావ్ నటన గూర్చి ఆయన వేసిన స్టెప్స్ గురించి తెగ పొగిడేస్తున్నాడు. ఆంజనేయులు వెళ్ళిన అర గంటదాకాఆయన్ని పట్టించుకునే వారేలేరు. కాస్సేపటికి ఆ బెల్‌బాటమ్ కుర్రాడే చూసి యిదేదో దసరా వేషమనుకొని వెళ్ళవయ్యా అన్నట్టు పక్క టేబిల్ కేసి చూపించాడు. పెన్షన్ డబ్బులికి అక్కడికి వెళ్ళాలి కామోసనుకుని అక్కడికి వెళ్ళేడు. అక్కడ పెద్ద నామం అదీ పెట్టుకుని హనుమంతాచార్లుగారు కూర్చుని పేపర్ చదువుకుంటున్నారు. ఆంజనేయుల్ని చూడగానే "నిన్ను లోపలికెవరు రానిచ్చారు?" అంటూపెద్ద కేకలేశాడు. ఆంజనేయుడు భయపడుతూనే తానొచ్చిన విషయం బైటపెట్టేడు.

"అలాగా దానికి ఉత్తినే డబ్బులిచ్చీరు. నువ్వో అప్లికేషన్ నింపి ఇయ్యాలి" అన్నారు ఆచార్లుగారు.

"చిత్తం నాకు నింపడం రాదు. మీరే నింపీండి" అన్నాడు ఆంజనేయులు.

ఎగాదిగా చూసి "నీ పేరేమిటి ?" ప్రశ్నించారు ఆచార్లుగారు అప్లికేషన్ నింపడానికి ఉద్యుక్తుడవుతూ.

"చాలాపేర్లున్నాయండీ. మీకు తెలుసు కదా ఏదో ఒకటి రాసీండి" అన్నాడు ఆంజనేయులు.



పేరు : పంతుల నాగేశ్వరరావు

చదువుతున్నది బి. యస్సీ, సెకెండియర్, మహారాజా కాలేజ్ విజయనగరం. ఈ కథ రాయడానికి ప్రోత్సహించిన రామతూరిగారికి, మా మామయ్య నరసింహమూర్తిగారికి కృతజ్ఞతలు. నా గురించి, నా హాబీల గురించి ప్రత్యేకంగా చెప్పుకుందికి ఏమీలేదు కానీ డిబేట్లు, డొనేషన్ కట్టలేకపోయినా ఇంజనీరింగ్ సీటు కోసం ప్రయత్నాలూ నా హాబీలు.

—పంతుల నాగేశ్వరరావు

"ఏం తాగొచ్చేవా ?" ప్రశ్నించేరు ఆచార్లుగారు.

ఆంజనేయుడు గజగజ వణికిపోయి "ఆంజనేయులు" అన్నాడు.

మొత్తానికి అప్లికేషన్ నింపి వెళ్ళిపోతుండగా "ఏయ్ ఆగు" అన్నారు ఆచార్లుగారు.

"ఏవండీ" అన్నాడు ఆంజనేయులు.

"అప్లికేషన్‌డబ్బులో ....?"ఆచార్లుగారి ప్రశ్న.

"దిక్కులేనివాణ్ణి అని కదా అప్లికేషన్ పెట్టింది! నాదగ్గరెక్కడుంటాయి" ఎదురు ప్రశ్న వేశాడు ఆంజనేయులు ధైర్యంగానే.

"వేషం కట్టావుకదా డబ్బులేమీ రాలేదా ?" అడిగారు ఆచార్లుగారు. అది వేషంకాదనీ, తాను నిజంగానే ఆంజనేయుడనీ, తన తోక కూడా నిజమైనదేనని ఒప్పించీసరికి తలప్రాణం తోకకొచ్చింది ఆంజనేయుడికి.

తనతోక నిజమైనదనగానే ఆచార్లుగారి మొహం వెయ్యివాట్స్ బల్బులా వెలిగింది. "మరిహనేం నీ తోకలో ఓ ఇంచీ కోసి ఇచ్చేయ్" అన్నారు ఆచార్లుగారు.

(పాఠకులకో మనవి : ఆ సమయంలో రష్యాలో కోతుల తోకలతో ఒక ప్రత్యేకమైన కొత్తరకం ఇంధనం తయారుచేసే పద్ధతి కనిపెట్టేరు. దాంతో ఆ తోకలకి ఎక్కడలేని గిరాకీ పెరిగింది. కోతులన్నీ మాయమయ్యాయి. కోతి కన్పించడమే అపురూపమయిపోయింది.) చేసేది లేక ఆంజనేయులు తోకలో చిన్న ముక్క యిచ్చేడు. ఆంజనేయులికి కోవెల హుండీల్లో వేసే డబ్బులు యెప్పుడేనా దక్కితేనా ? తన్నీ, తన గుడినీ కలిపి మింగేసే మహానుభావు లున్నారు మరి. ఆచార్లుగారు సంతోషంతో(డబ్బులు దొరికినందుకు) యింటికి వెళ్ళేటప్పుడు ఆంజనేయస్వామి కోవెల్లో ఒక కొబ్బరికాయ కొట్టి మరీ వెళ్ళేరు.

నెల్లాళ్ళుపోయాక ఆంజనేయులు మళ్ళీ వచ్చాడు. ఇంకా పని కాలేదన్నారు. మరో నెల్లాళ్ళకి మళ్ళీ వచ్చాడు. అప్పటికీ కాలేదన్నారు. మూడోసారి గట్టిగా అడుగుదా మనుకుని భయపడుతూనే లేటుకి కారణమేవిటని అడిగేడు. ఈ టేబిల్‌దాటి నీ ఫైల్ వెళ్ళాలంటే కొంత ఖర్చవుతుంది మరి అన్నారు ఆచార్లుగారు. పర్యవసానంగా ఆంజనేయుడితోక మరో రెండించీలు పొట్టయింది. ఆ టేబిల్‌నుంచి మరో మూణ్నెల్లు పోయాక ఆంజనేయుని తోక మరో మూడించీలు పొట్టవగానే తరువాతి టేబిల్‌మీదకి గెంతింది. ఇలా అంచెలంచెలుగా ఆంజనేయుడి తోక పూర్తికాగానే ఆయనకి పెన్షన్ గ్రాంటయింది.

ఆ కాయితమేదో తీసుకుందామని ఆఫీసుకి వెళ్ళాడు ఆంజనేయులు.

"ఆంజనేయులంటే నువ్వేనా ?" ప్రశ్నించారు ఆఫీసరుగారు.

"చిత్తం" ఆంజనేయుడి సమాధానం.

"ఇంతకుముందు ఏం చేసేవాడివి ?" ఆఫీసరుగారి ప్రశ్న.

"రామ రావణ యుద్ధంలో రాముడి తరపున ఫీల్డ్‌మార్షల్‌గా పనిచేసేను" అన్నాడు ఆంజనేయులు.

"వ్హాట్ నాన్‌సెన్స్ యూ ఆర్ టాకింగ్ ? నువ్వా ఆంజనేయుడివా ? అయితే నీ తోకేదీ ?" అని అరిచేరు ఆఫీసరుగారు.

పైగా "మారుపేరుతో మోసాలుచేసి పెన్షన్ పుచ్చుకోబోయిన నేరానికి నిన్ను ఎరెస్ట్ చేయించీగల్ను జాగ్రత్త" అని హెచ్చరించి ముసలివాడన్న జాలితో వదిలీసేరు. దెబ్బతో గుండాగిపోయింది పాపం చిరంజీవికి.